# క్షమా భారం

ఆఫీస్‌కి రాగానే అందరూ అభినందనలు చెప్తూంటే వుక్కిరి బిక్కిరి అయింది ఉమ. “ఎందుకు?” అని నవ్వుతూ అడిగింది. “అబ్బా! యేంతెలియనట్లు....” కొలీగ్స్ వేళాకోళం చేశారు. తెలుసు తనకి, ఈరోజు కోసమే యెన్నాళ్లై యెదురుచూస్తోంది. “మేడమ్! సాబ్ పిలుస్తున్నారు” అటెండర్ పిలవగానే “వెళ్లమ్మా శుభవార్త తెలుసుకునిరా!” అంటూ అందరూ చేయి వూపి ఆమెని సాగనంపారు. బాస్ రూమ్‌లోకి ప్రవేశిస్తూ “ఇది నిజంగా తను యెదురు చూస్తున్న శుభవార్త ఐతే బాగుండును ” అనుకుంది.

“Good Morning Sir!" ఉమ విష్ చెయ్యగానే తలెత్తి చూశాడు ఆమె బాస్ భట్. “Very Good Morning Uma!" అంటూ నవ్వుతూ “See this long-awaited offer" అంటూ ఒక letter ఆమె చేతికి అందించాడు. మెల్లిగా వణుకుతున్న చేతులతో దాన్ని విప్పి చూసింది.

నిజంగా యిన్నాళ్లై తను యెదురుచూస్తున్నదే! తను చేసిన projectsని appreciate చేస్తూ USA లో వున్న తమ Parent Company నుండి వచ్చిన letter. అంతేకాదు విశేషం, అందులో వున్న విషయం... Brazil. China, Malaysia, Denmarkలో వున్న తమ కంపెనీలలో కొన్ని projects చెయ్యాలనీ

అందుకు ముందుగా USA వచ్చి Parent Company లో కొన్నాళ్లు పని మీద అవగాహన పెంపొందించుకునే అవకాశం ఆఫర్ చేస్తూ US Parent Company నుండి అక్కడి Director స్వయంగా పంపిన offer letter.

ఇదంతా జరగడానికి ముఖ్య కారణం తన బాస్ భట్ చేసిన రికమండేషన్. తన కన్నా యెక్కువగా భట్ ఈఆఫర్ యెప్పుడు వస్తుందా అని ఆత్రుతగా ఎదురు చుస్తున్నాడు. అతని చిరునవ్వు చూస్తూంటేనే తెలుస్తోంది తన కన్నా యెక్కువగా ఆనందపడ్తున్నాడని..

"Congrats" అంటూ చెయ్యి చాపాడు. "Thank you very much Sir!" అంటూ అతని చెయ్యి అందుకుంది.

"ఉమా! మిగిలిన వివరాలు మన HR Departmentకి వెళ్లి తీసుకో. వెంటనే వీసాకి apply చెయ్యి. We don't have much time" అంటూ జేబులోంచి ఒక చాక్లెట్ అందించి "All the best Uma!" అంటూ విజయసంకేతంగా చెయ్యి వూపి బొటనవెలు యెత్తాడు.

అతని ఆప్యాయతకి ఉమకళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. మెల్లిగా నిగ్రహించుకుని తన సీట్దగ్గరికి వచ్చేసింది. అతనేకాదు తన కొలీగ్స్ అందరూ యెంతో ఆప్యాయంగా ఆదరంగా తనతో మసలుకుంటారు. తనకన్నా వయసులో పెద్దవాళ్లు కూడా యెంతో మర్యాదగా పలకరిస్తారు . ఆ ఆదరణ, మర్యాద తన పని వల్ల ,తన స్వభావం వల్లా అని తనకి తెలుసు.

కానీ.. మరి ... విక్రమ్?? తను ప్రేమించి పెద్దల్ని వప్పించి పెళ్లి చేసుకున్న భర్త!!! అతనికి తనలో లేని లోపాలే కనిపిస్తాయి యెందుకని? మూడు నిండు సంవత్సరాలు యిద్దరూ ప్రేమించుకున్నారు.

ఎన్నెన్నో వాగ్దానాలు చేసుకున్నారు. తన project worksలో రాబోయే సమస్యలు తను ముందుగానే వూహించగలదు. దానికి తగినట్లుగా ప్లాన్ చేసుకుని సకాలంలో target reach అవగలదు. కానీ నిజ జీవితంలో ప్రేమించిన వ్యక్తి గుణగణాలు అస్సలు అంచనా వెయ్యలేకపోయింది. తెలుసుకోలేకపోయింది. తన తెలివితేటలు చదువు, వుద్యోగం వరకే పరిమితమా!! విక్రమ్‌ని ప్రేమించడం మొదలుపెట్టినప్పటి నుండీ తనకి లోకమంతా యెంతో పచ్చగా ప్రేమమయంగా కనిపించేది. అతని మాటలు యెంతో తీయగా అమృతంలా వుండేవి. పెళ్లి ముందర అతని అసలు స్వభావం తెలుసుకోలేకపోయింది.

దీర్ఘంగా నిట్టూర్చింది ఉమ. ఇంతటి మంచివార్త పంచుకోడానికి యెవ్వరూ లేరు కదా! మనసు బరువుగా వుంది. ఒక్కసారి ఇంటికి ఫోన్ చెయ్యాలి. చిన్నాతో 'హలో' చెప్పించుకోవాలి. వెంటనే యింటి నంబరు డయల్ చేసింది. మామగారు గిరి ఫోన్ యెత్తాడు.

"ఉమా! లంచ్ టైమ్ అవకుండానే ఫోన్ చేశావు. ఏమ్మా! వంట్లో బాగానే వుందా?" కాస్త ఆదుర్దాగా అడిగాడు.

"అబ్బే అదేం లేదు అంకుల్! ఒక్కసారి చిన్నాతో 'హలో' చెప్పించండి." మెల్లిగా అంది. "అలాగే ఉమా! లైన్లో వుండు". అంటూ రెండేళ్ల చిన్నాని యెత్తుకుని "అమ్మకి హలో చెప్పు చిన్నా" అంటూ ఫోన్ వాడి మొహం దగ్గర పెట్టాడు. వాడు ముద్దుగా 'అల్లో అమ్మా' అన్నాడు. వాడికి ఫోన్ దగ్గర పెట్టగానే 'హల్లోఅమ్మా' అనడం ఉమ నేర్పించింది. వాడి గొంతు వినగానే ఉమకి మనసులోని భారం అంతా దిగిపోయింది. ఉల్లాసంగా తన పనిలో

నిమగ్నమైంది. లంచ్ టైము దాకా వంచినతల యెత్తకుండా పనులు పూర్తిచేసుకుంది.

HR Departmentని contact చేసింది. వాళ్ల దగ్గరికి వెళ్లి Visaకి కావలసిన పేపర్స్ అన్నీ రెడీ చేసుకుంది. ముఖ్యమైన Mails పంపించేసరికి లంచ్ టైమ్ అవనేఅయింది. అందరూ Cafetaria చేరుకున్నారు. లంచ్ అయ్యాక USలో వున్న తన friendకి mail రాయాలి అనుకుంది ఉమ. ఇంతలో సెల్ మెల్లిగా మోగింది. ఆఫీసులో వున్నంతసేపూ వాల్యూమ్ చాలా తక్కువగా పెట్టుకుంటుంది. తీసి స్క్రీన్ మీద పేరు చూసింది.. 'విక్రమ్'.

సేదతీరిన మనసు మళ్లా అలజడి చెందింది. ఏదోకటువు మాట అనడానికే అతను యెప్పుడైనా ఫోన్ చేస్తాడు. ఈరోజు యేమంటాడు? అతనికి దూరంగా వుంటున్నా యిలాంటి అలజడులు తప్పడంలేదు అనుకుంటూ Cell on చేసి 'హలో' అంది. "మేడమ్‌గారు చాలా హుషారుగా వున్నారే?" వ్యంగ్యంగా వున్న అతని మాటకి జవాబుచెప్పలేదు ఉమ. "వింటున్నావా?" "విషయం చెప్పండి." ముక్తసరిగా అంది.

"నిజంగా అమెరికా ఎగిరి వెళ్లిపోదామనే నీప్లాన్?" 'అప్పుడే అతని దాకా వెళ్లిందా యీవార్త' మనసులోనే అనుకుంది. 'ఎందుకు వెళ్లదూ? తన ఆఫీసులోనే అతనికి యెప్పటికప్పుడు వార్తలు చేరవేసే శ్రేయోభిలాషులు వున్నారుకదా!' విరక్తిగా అనుకుంది. "నేను లంచ్‌కి వెళ్తున్నాను తరవాత ఫోన్ చేస్తారా?" అంటూ కాల్‌కట్ చేసింది.

ఉదయం నుండీ మనసులో వున్న ప్రశాంతత పోయింది. ఆకలి కూడా చచ్చిపోయింది. Cafetariaకి వెళ్తున్న ఆమె కొలీగ్స్ వెనకబడ్డ ఉమ కోసం ఆగారు. గబగబా వాళ్లని చేరుకుని మందహాసం చేసింది. అందులో జీవంలేదని

దగ్గరి ఫ్రెండ్ కమల గ్రహించింది. "ఏయ్!ఉమా! మమ్మల్ని వదిలివెళ్లిపోవాలని అప్పుడే టెంగా? మొహం అలాదిగులుగా పెట్టుకున్నావు?" అని హాస్యంగా అంటూ వాతావరణం కాస్త తేలికపర్చింది. "నీమొహం" అంటూ వీపుమీద చిన్నగా తట్టి "పద పద ఆలస్యం చేస్తే మంచి ఐటమ్స్ దొరకవు" గబగబా ముందడుగు వేసింది ఉమ. కాస్త పెరుగన్నం తిని వేడిగా కాఫీ తాగుతూ Cafetaria బయట బాల్కనీలో కూర్చుంది. కమల కూడా వచ్చి పక్కనే కూర్చుంది. మిగిలిన కొలీగ్స్ దాదాపుగా అందరూ వెళ్లిపోయారు.

"ఇప్పుడు చెప్పు యేమిటి విషయం?" "నాకు విషయాలూ విశేషాలూ 'విక్రమ్' కదా" శుష్కహాసం చేసింది.

"మళ్లా విడాకులంటున్నాడా?ఇచ్చి పారేయ్." కమల కాస్త కోపంగా అంది.

"అతను ఎంత అడిగినా విడాకులు యివ్వడం నాకు యిష్టం లేదు. ఇప్పుడు విషయం నా US trip." "వెళ్లద్దంటాడా?" అదే కోపంగా అంది కమల.

"అదే అతని వుద్దేశం. నాకు తెలుసు. కానీ నేను వెళ్లితీరతాను. ఈ offer నాభవిష్యత్‌కి చాలా ముఖ్యం కమలా!విక్రమ్ యేవిధంగానూ నన్ను అడ్డుకోలేడు". నిశ్చయంగా అంది ఉమ. "అలావుండాలి పట్టుదల అంటే. ఉమా! అతను నిన్ను యేయిబ్బందులూ పెట్టకుండా మేము చూసుకుంటాము. You need not worry at all." కమల ఉమ భుజంతట్టి, "ఈ మాటలు మన బాస్ నీకు ప్రత్యేకంగా చెప్పమన్నారు" నవ్వుతూ అంది. "నీ ఫ్రెండ్ వున్నారు కదా USలో. వాళ్లని contact చేసి చిన్నాతో వెళ్లి వుండే యేర్పాట్లు చేసుకో. విక్రమ్ లాంటి సిల్లీ విషయాలతో మనసు పాడుచెసుకుని టైమ్ వేస్ట్ చేసుకోకు."

"ఇది కూడా మన బాస్ చెప్పమన్నారా?" నవ్వుతూ లేచింది ఉమ.

"పదపద. లంచ్‌బ్రేక్ అయిపోయింది." అంటూ యిద్దరూ తమతమ సీటుకి వెళ్లారు. US ఫ్రెండ్‌కి వెంటనే mail రాయమని మళ్లీ హెచ్చరించింది కమల. ఆఫీస్ కంప్యూటర్ నుండి పర్సనల్ mail రాయడం ఉమకి యిష్టం లేదు. రూల్స్ కూడా వప్పవు. తన బాగ్ లోంచి 'Tab' తీసి friendకి mail రాసింది. రాత్రి తనని contact చెయ్యమనీ అప్పుడు వివరంగా మాట్లాడతాననీ తన US ఆఫర్ గురించి చూచాయగా ప్రస్తావించి mail ముగించింది. "హమ్మయ్యా అర్జంట్ పనులు అయ్యాయి." అనుకుంది. బాస్ రూమ్‌కి వెళ్లి US letter copy తెచ్చుకుని యింటికి బయలుదేరింది.

రోజూ సగందూరం pool vanలో వచ్చి అక్కడ పార్క్ చేసుకున్న తన Scootyలో యింటికి వస్తుంది ఉమ. దాదాపు గంట ప్రయాణం మొత్తంగా. ఇంటికి రాగానే చిన్నా తనని 'అమ్మా!' అంటూ అల్లుకుపోతాడు. ఓపావుగంట కనీసం వాడితో ఆడాలి, లేకపోతే వూరుకోడు. అప్పటికి తనకీ అలసట తీరుతుంది. ఒంటరి జీవితం అలవాటైపోయింది. మామగారు తనకి సాయంగా వారమంతా వుంటారు. శనాదివారాల్లో ఆయన యింటికి వెళ్తారు.

కొడుకుని పల్లెత్తుమాట అనకపోయినా, విక్రమ్ స్వభావం ఆయనకి నచ్చలేదని తనకి తెలుసు. మౌనంగా కొడుకు పట్ల తన అయిష్టత యీ విధంగా చెప్తున్నారా అనిపిస్తుంది తనకి. అత్తగారూ మంచావిడే కానీ అపరిమితమైన ఆవిడ పుత్రప్రేమ ఆమంచితనాన్ని జయించింది ... ఆవిడ దృష్టిలో తనని దోషిగా నిలబెట్టింది. అత్తమామల విషయంలో తను నిస్సహాయురాలు. నిట్టూర్చింది ఉమ. ఇల్లు చేరగానే చిన్నా పరుగునవచ్చి కాళ్లలో పడ్డాడు. వాడిని యెత్తుకుని లోపలికి వచ్చింది. గిరి "వచ్చావామ్మా!" అంటూ పలకరించాడు.

"ఏదో ఆనందంగా వున్నావు" నవ్వుతూ అన్నాడు. మనసారా నవ్వింది ఉమ. "అవును అంకుల్" అంటూ బాగ్‌లోంచి offer letter తీసి అందించింది. ఆసాంతం చదివి "బాగుందమ్మా! ఇదంతా నీకృషిఫలితమే. నీశ్రమకి గుర్తింపు. సంసారంలోని వడిదుడుకులు అధిగమించి ఇది సాధించావమ్మా." Letter చూపిస్తూ అన్నాడు. చిన్నగా నవ్వి వూరుకుంది. "సీతమ్మ వచ్చిందా?" చిన్నాతో ఆడుకుంటూ  అడిగింది. "ఆ దాని పని చేసుకుని వెళ్లింది." అని చిన్నాని యెత్తుకుని బాల్కనీ లోకి వెళ్లాడు. ఉమ గదిలోకి వెళ్లి ఫ్రెష్ అయి వంటింట్లోకి వెళ్లి సీతమ్మ చేయగా మిగిలిన పనులు చక్కబెట్టుకుంటూనే విక్రమ్ ఫోన్‌కాల్ గురించి ఆలోచిస్తోంది.

అతని వుద్దేశం యేమైవుంటుంది? పనికట్టుకుని తనకి ఆఫీస్ టైమ్‌లో ఫోన్ చేశాడంటే ...యేదో ప్లాన్ మీదే వున్నాడు. పెళ్లి ముందర తను అతని మాటలు వింటూ వుండాలనీ అతని సమక్షంలో యెక్కువ టైము గడపాలనీ తహతహలాడేది. ఇప్పుడు ...హు!! అతని మాట వింటూనే చేదుతిన్నట్టు మనసు తిరగబడి అతని మాట వెనక వున్న వుద్దేశాలు పసిగట్టాలని లోతుగా ఆలోచిస్తోంది. ప్రేమించి పెళ్లిచేసుకున్న తను యేంపొందింది?

చిన్నా ఆకలని గునుస్తున్నాడు, వాడి గొంతు విని తన ఆలోచన కట్టిపెట్టింది. వాడికి అన్నం పెట్టి తనూ గిరీ తిన్నాక మళ్లా ఆఫీస్ పని మిగిలినది క్లియర్ చెయ్యడానికి కూర్చుంది. HR Department చెప్పిన ప్రకారం తనకి VISA త్వరగానే వస్తుంది. US friend కి అన్నీ వివరంగా చెప్పాలి. ముఖ్యంగా చిన్నా గురించి.ఇప్పుడు తనకి USలో టైము వుదయం బహుశ ఆఫీస్‌కి వెళ్లే హడావిడిలో వుంటుంది. 'నాmailచూసి తనే కాల్ చెస్తుంది' అనుకుంది ఉమ. వివరంగా మరొక mail రాద్దామని mail box openచేసింది.

ఇంతలో గుమ్మం దగ్గర అలికిడి అయింది. తలెత్తి చూసింది. గిరి!! గబుక్కున లేచి నిలబడింది.

“పనిలో వున్నావా ఉమా?” మెల్లిగా అడిగాడు.

“అబ్బే అర్జంట్ యేమీలేదు అంకుల్! లోపలికి రండి” మర్యాదగా అంది.

“వద్దులేమ్మా. చిన్నా నిద్రలేస్తాడేమో. నువ్వు కాస్త హాలులోకి వస్తే” సంశయంగా అన్నాడు. అలాగే ఒక్కనిమిషం Laptop close చేసి వస్తాను” అంటూ గబగబా అన్నీ సర్దిపెట్టి హాలులోకి వచ్చింది. “విక్రమ్ మధ్యాహ్నం యింటికి ఫోన్ చేశాడు” వుపోద్ఘాతం లేకుండా సూటిగా అన్నాడు గిరి. ఆశ్చర్యంగా చూసింది ఉమ. “అవునమ్మా. నాకొడుకు యిన్నాళ్లకి నాతో మాట్లాడాడు.” కాస్త బాధగానూ, వ్యంగ్యంగానూ అన్నాడు. ఉమ యేమీ మాట్లాడలేకపోయింది. తనవల్ల మామగారు కొడుక్కి దూరమయ్యారేమోకదా!

“ఉమా! నువ్వు అమెరికా వెళ్లేముందరే చిన్నాని తనకి అప్పచెప్పాలని విక్రమ్ గట్టిగా హెచ్చరించాడు.” ఉమ వులిక్కిపడింది. ఇదేమి కొత్త మెలిక? తను విదేశాలకి వెళ్లాలనుకోవడమే చిన్నాకోసం కదా. ఇలాగైనా తను వెళ్తే మామగారు తిరిగి తన యింటికి వెళ్లగలరు. విక్రమ్ తనని కాదన్నా మామగారు మాత్రం కోడలు, మనవడు బాధ్యత తనదే అని నిశ్చయించుకున్నారు. కానీ తమ బాధ్యత రోజురోజుకూ అతనికి ఒక గుదిబండలా తయారైంది. అతను వదిలించుకోలేడు - తను వదలలేదు.

“ఉమా! నువ్వు దిగులు పడకమ్మా. చిన్నాని వదిలి నువ్వు విదేశాలు వెళ్లే ప్రసక్తేలేదు. మీయిద్దరి ప్రయాణానికి తగిన యేర్పాట్లుచేసుకో అమ్మా!” భరోసాగా అన్నాడు గిరి. “ఈఆలోచన యెవరి ప్రోద్బలమో నాకు తెలుసు” తనలో తాను అనుకున్నాడు.

కలతచెందిన మనసుతో రూమ్‌లోకి వచ్చిన ఉమ చిన్నా పక్కనే పడుకుని వాడిమీద చెయ్యివేసుకుంది. విక్రమ్‌తో తనస్నేహమూ పెళ్లీ తరవాత అతని నిజస్వభావం తెలియడం, చిన్నా పుట్టినప్పుడు విక్రమ్ చేసిన గొడవా అంతా ఒకసినిమా రీలులా కళ్లముందర మెదిలింది. ఒకటా రెండా..మూడుసంవత్సరాలు తనతో తీయగా మాట్లాడుతూ విక్రమ్ తన అసలు స్వభావం తెలియనీయలేదు. తనే తెలుసుకోడానికి ప్రయత్నించలేదు. అతని స్నేహం, ప్రేమలో నిండా మునిగిపోయింది. పెళ్లికి ముందరే తనకి రెండు ప్రమోషన్స్ వచ్చాయి. విక్రమ్ యెంతో సంతోషించి తనని ప్రోత్సహించాడు.

అతని జీతం కన్నా తనది యెక్కువని ఉమకి యేదో మొహమాటంగా వుండేది. ఒకసారి విక్రమ్‌తో అందికూడా "మీ salary కన్నా నాది యెక్కువని మీరు ఫీలవుతున్నారా?" విక్రమ్ మెత్తగా నవ్వుతూ ఉమ చెయ్యి పట్టుకుని "ఉమా డియర్! ఇంకా నీదేమిటి? నాదేమిటి? అంతా మనదే అను, త్వరలో ఒక్కటి కాబోతున్నాం కదా" ఆమాటలు అతని విశాలహృదయానికి నిదర్శనం అని యెంతో పొంగిపోయింది. కానీ ఆమాటల వెనకవున్న అతని లోతైన మనసు లోని అసలు ఆలోచన తెలుసుకోలేకపోయింది. ఇరువైపులా పెద్దల్ని వప్పించడం కష్టమే అయింది. ఈజీతాల వ్యత్యాసమే వాళ్లకి అభ్యంతరం అయింది. ఉమ తండ్రి కూతురికి నచ్చచెప్పడానికి యెంతో ప్రయత్నించాడు.

"ఉమా! మగవాడు తనకన్నా భార్య పైస్థానంలో వుండడం సహించలేడు, అందులోనూ సంపాదన యెక్కువగా వున్న భార్యని అస్సలు సమర్థించలేడమ్మా. అతనికి ప్రమోషన్స్ లేవనీ ,వుద్యోగంలో పైకి రావడానికి అవకాశం తక్కువనీ అంటున్నావు కదా."

"విక్రమ్ అలాంటివాడు కాదు నాన్నా! చాలా విశాలహృదయం తనది. నేను యింకా యింకా పైకి ఎదగాలని ఎంత ప్రోత్సహిస్తున్నారో తెలిస్తే మీరే ఆశ్చర్యపోతారు." ఆమె మాటల్లో విక్రమ్ పట్ల వున్న ప్రేమ నమ్మకం నిండుగా గోచరించాయి. ఉమతండ్రి యింకేమీ మాట్లాడలేకపోయాడు.

కూతురికి యెలా అర్థం అవుతుంది విక్రమ్ స్వభావం?కూతురి మనసు అంతగా ఆక్రమించుకుని తనకి అనుగుణంగా ట్యూన్ చేసిన విక్రమ్ తెలివితేటలకి ఆశ్చర్యపోయాడు, ఆఅతితెలివి ఉమ జీవితం కబళించివేస్తుందేమో అని కాస్త భయపడ్డాడు కూడా. కూతురి వైవాహిక జీవితం యే వడిదుడుకులు లేకుండా సాఫీగా గడవాలని మనస్పూర్తిగా కోరుకున్నాడు. విక్రమ్ తల్లితండ్రులు కూడా పెళ్లికి మనస్పూర్తిగా వప్పుకోలేదు. అతని తల్లి సావిత్రమ్మకి రాబోయే కోడలు 'వుద్యోగస్థురాలు' అన్న విషయమే నచ్చలేదు, అందులోనూ విక్రమ్ కన్నా హోదా, జీతమూ రెండూ యెక్కువే. "ఎందుకురా పనిగట్టుకుని అంత యెక్కువలో వున్న ఆఅమ్మాయిని చేసుకోవడం? రేపు పెళ్లయ్యాక నీకేమైనా మర్యాద యిస్తుందా?" తల్లి మాటలకి విక్రమ్ నవ్వి

"అమ్మా! అలాయెక్కువలో వున్నవాళ్లే భర్తలకి యెంతో మర్యాద యిస్తారు, జీతం తెచ్చి భర్తల చేతికే యిస్తారు." కొడుకు తెలివికి తల్లి మురిసిపోయి "సరేరా నీయిష్టం. నిన్ను గౌరవంగా చూడకపోతే మాత్రం నేను వూరుకోను" అంటూ బెదిరించినట్టు అంది. భార్యమాటలు వింటున్న గిరికి నవ్వాలో యేడవాలో తోచలేదు. కొడుకు మీద ప్రేమకి తనే అధికారిణి అనుకుంటోంది. విక్రమ్ పెళ్లికి గిరి నిశ్శబ్దసాక్షిలా మౌనంగా వుండిపోయాడు. సావిత్రమ్మ చేస్తున్న హడావిడి భరించలేక విక్రమ్ రిజిస్టర్‌మారేజ్ చేసుకుందామని ఉమతో అన్నాడు.

ఉమ కూడా అదే మంచిది అనుకుంది. ఆర్భాటం పెళ్లి అంటే తనకీ యిష్టంలేదు. క్లుప్తంగా Registered Marriage చేసుకున్నారు. ఉమకి యెంతైనా ఆనందంగా వుంది. విక్రమ్ తన భర్త... అంతా తన అదృష్టం అని పొంగిపోయింది.

ఆసంతోషం యెన్నాళ్లో నిలవలేదు. మంచితనం ముసుగు తీశేసిన అతని అసలుస్వభావం ఉమకి త్వరగానే అర్థం అయింది.  ఆనెల యధాప్రకారంగా జీతం తన Bank account లో జమ చెయ్యబడింది. మిగిలిన లావాదేవీలన్నీ సాధారణంగా తన Debit Card ద్వారా చేసుకుంటుంది. కానీ విక్రమ్ అన్నమాటలే తనకి చాలా అసాధారణంగా తోచాయి. “ఉమా! నీ జీతం మొత్తం cash withdraw చేసి తీసుకునిరా. కొన్ని తప్పని సరి ఖర్చులున్నాయి” ఉమకి అతని మాటలు పూర్తిగా అర్థం కాలేదు.

“ఎందుకు?” అప్రయత్నంగా అడిగింది. వెంటనే విక్రమ్ హావభావాలు ఒక్కసారిగా మారిపోయాయి. “ఎందుకో చెప్పాలా?” విసురుగా అని బయటకి వెళ్లిపోయాడు. టేబిల్‌మీద టిఫిన్ అలాగే చల్లారిపోయింది. విక్రమ్ ప్రవర్తన కొత్తగా అనిపించి ఉమ గుండెలు దడదడలాడాయి. “మాయిద్దరి మధ్యా డబ్బు గొడవలు రాకూడదు” మనస్ఫూర్తిగా అనుకుంది. కానీ అవే వాళ్ల అనుబంధానికి అడ్డుగోడలయ్యాయి.

“అమ్మా! ఉమ తన జీతం అంతా నాచేతికి యిచ్చేస్తే నేను యింక కష్టపడి వుద్యోగం చెయ్యవలసిన అవసరం వుండదు” విక్రమ్ ఒకసారి సావిత్రమ్మతో అన్న మాటలు స్వయంగా విన్న ఉమ మనసు దెబ్బతింది. అతని క్రెడిట్‌కార్డ్ బిల్స్ కూడా ఉమనే కట్టమనడం సహించలేకపోయింది. తన ఖర్చులకి  కూడా ఉమ జీతం వాడాలనుకోవడంతో ఉమ మనసు విరిగిపోయింది.

"నాడబ్బు కోసమే నన్ను పెళ్లి చేసుకున్నాడన్నమాట. ఎంత మోసం!" కోపంగా అనుకుంది. తను యెంత మూర్ఖంగా మోసపోయింది!! ఏమైనా అతని ఆటలు సాగనివ్వదు. అతని నిజ స్వభావం తెలియగానే విక్రమ్ మీద వున్న ప్రేమ పూర్తిగా మాయమైపోయింది. ఒక విధమైన విముఖత మొదలైంది. ఒకేయింట్లో వుంటున్నా దారులు వేరయ్యాయి. మాటలు కరువయ్యాయి. ఏజీతంకోసం ఉమని పెళ్లిచేసుకున్నాడో ఆడబ్బు చేతికిరాక విక్రమ్‌కి ఉమ అంటే నిరాదరణ యేర్పడింది. "బంగారుబాతు"లాంటి ఆమెనీ, ఆమెజీతాన్నీ ఉపయోగించుకోవచ్చుఅనుకున్న అతని ప్లాన్ దెబ్బతినేసరికి ఆమెని యెలాగైనా వదిలించుకోవాలన్న ఆలోచన మొదలుపెట్టాడు. ఇంతలో ఉమ గర్భవతి అయింది. అప్పుడుకూడా అతని తీరు యేమీ మారలేదు. చిన్నా పుట్టాక నామకరణం పీటలమీద కూర్చునే ముందర అతను అన్నమాటలు శూలాల్లా ఉమ గుండెల్లో దిగాయి.

"ఎవరో కూర్చోవలసిన పీటలమీద నేను కూర్చుంటున్నాను కదా!" ఉమ ఎర్రబడిన కళ్లతో అతన్ని తీక్షణంగా చూసింది.

"ఎవరి ప్రసాదమో యీపుత్రరత్నం" వికటంగా నవ్వాడు. ఉమ అంటే యిష్టం పోయిన విక్రమ్ యింకొక అమ్మాయితో స్నేహం మొదలుపెట్టాడు. 'మరొక అందమైన వల' అనుకుంది ఉమ. 'విడాకులు' అంటూ పాట మొదలు పెట్టాడు. అతని నీచప్రవర్తనకి విసిగిపోయిన ఉమ వెంటనే వప్పేసుకుందామని వుద్వేగం చెందింది. మళ్లా నిదానంగా ఆలోచించింది. తను విడాకులు యివ్వగానే మరొక అమ్మాయిని మోసగించడానికి విక్రమ్ రెడీగా వున్నాడు. అతనికి అలాంటి అవకాశం మళ్లా కలగకూడదు. 'నాలాగ మరేఅమ్మాయి అతని వలలో పడకూడదు' అనుకుంది.